అప్పుడు కదిలాడు రాంనాథ్. వడిగా నడుచుకుంటూ వెళ్ళి మూలుగుతూ భయంగా చూస్తున్న సర్దార్ గుండెమీద బూటుకాలు వేసి తొక్కుతూ చెప్పాడు.

"మీరు ఈ నగరానికి పెద్ద గూండాలు. ఓ పిడిబాకు, నాలుగు ఐరన్‌రాడ్స్ అరడజను సైకిల్ చైన్స్ పట్టుకుని తిరిగినంత మాత్రాన హీరోలయిపోయార్రా."

బూటుకాలు ఎత్తి ఫెడీమని తన్నిన తన్నుకు సర్దార్ కళ్ళముందు నక్షత్రాలు మెరిశాయి.

"లే... పైకిలే...... లేచి ప్యాంటూ షర్టూ విప్పు"

సర్దార్ భయంగా చూశాడు.

రాంనాథ్ కాలు మరోకసారి పైకి లేచింది.

ఇక సర్దార్ క్షణం కూడా ఆలోచించలేదు. చకచకా దుస్తులు విప్పడం మొదలుపెట్టాడు. రాంనాథ్ దృష్టి ప్రక్కకు తిరగింది. అప్పటికే ప్యాంటూ షర్టూ విప్పి కేవలం అండర్‌వేర్ మీద నిలబడివున్న రాకేష్ భయంగా వణుకుతున్నాడు.

"మీరు ఇద్దరూ వెళ్ళి ఆ వెధవల్ని కూడా బట్టలు విప్పమనండి. ... ఊ... వెళ్ళండి."

సర్దార్... రాకేష్... మణిశంకర్, పటౌడీల వైపు పరుగుతీశారు. పటౌడీని తనంతట తనే రాంనాథ్ చెప్పిన పనిచేశాడు. కాని మణిశంకర్ మాత్రం గింజుకోవడం మొదలుపెట్టాడు.

"చూస్తారేంట్రా... వాడి బట్టలు కూడా విప్పండి."

"వద్దు... వద్దు... లోపల డ్రాయర్ లేదు" చేతులు అడ్డం పెట్టుకుంటూ అరిచాడు మణిశంకర్.

అయినా సరే సర్దార్, రాకేష్, పటౌడీలు ఏమాత్రం ఆగలేదు. వాళ్ళు మణిశంకర్ మీద పడి అతడి చొక్కా బలవంతంగా చింపేశారు.

ప్యాంటు లాగుతున్న ఆ ముగ్గురినీ బెదిరిస్తూ అరిచాడు మణిశంకర్.

"బాస్ దగ్గరకి వెళ్ళనీ... మీ పని చెప్తా"

ఆ బెదిరింపుకు సమాధానంగా డొక్కల్లో బలంగా తగిలింది రాంనాథ్ బూటుకాలు. మణిశంకర్ బాధగా అరిచాడు. సర్దార్, రాకేష్, పటౌడీలు అతడి ప్యాంటు విప్పదీశారు.

రాంనాథ్ సూర్యనారాయణ వంక చూసి చెప్పాడు.

"పోలీసులకు ఫోన్‌చేసి... నలుగురు పిచ్చివాళ్ళు వాళ్ళలో వాళ్ళు కొట్లాడుకుని... చావడానికి రడీగా ఉన్నారనీ... వెంటనే రమ్మనమని చెప్పండి."

కాని అప్పటికే ఈ సన్నివేశాన్ని ఎదురుగ్గా ఉన్న చాయ్‌దుకాణం యజమాని రెహమాన్ తన బాస్ దేవీప్రసాద్‌కు పూసగుచ్చినట్టు మరీ చెప్పేశాడు.

ఈ సంఘటనతో జరగబోయే పరిణామాల్ని తల్చుకుని భయంతో దడదడలాడుతున్న గుండెతో టెలిఫోన్ వేపు పరుగుతీశాడు సూర్యనారాయణ.

(ఇంకావుంది)

# మానవత్వం

టికెట్స్ లందరిదగ్గరా ఉండాలిసార్! టికెట్స్ తీసారా సార్! వెనుకందరిదగ్గరా టికెట్స్ఉండాస్సార్. ముందు వెకేంగుంది. అంటూ బస్సంతా అభినవ అభిమన్యుడిలా కలయదిరుగుతున్నాడు కండక్టర్.

టికెట్స్ తీసే ఉద్దేశంలేని కుర్రాకారు కండక్టర్ ముందుకొస్తే వెనక్కి, వెనక్కొస్తే ముందుకి పోతూ కండక్టర్‌ని 'కబాడీ' ఆడించేస్తున్నారు.

చిన్నకుదుపుతో బస్సాగింది. 'పూర్ణామార్కెట్ జంక్షన్!' ఎవరో లేచిదిగిపోతున్నారు. నాపక్కసీటు కాళీ అయ్యింది.

'బాబూ! సింహాచెలం ఎళ్ళుర్దా?

కండక్టర్ 'వూం!' అనగానే, కొన్ని కాళీ తట్టలతో బస్సెక్కాడు వాడు.

నల్లగా, జిడ్డుగా, మూర్తీభవించిన దారిద్ర్యంలా వున్నాడు.

ఇటూ చూస్తున్నాడు. సీటుకోసం కాబోలు?

అమ్మో నాపక్కనే కూర్చుంటే? ఛీ...ఛీ... ఇదేమి కర్మరా బాబుతిన్నగా వచ్చి నాపక్కనే కూర్చు న్నాడు.

తైల సంస్కారంలేక రాగిరంగులోకి మారి అట్టలు కట్టిన జుత్తు, మాసి అతుకులుపట్టిన బట్టలు, చెవివెనుక సగంకాల్చి ఆరిన ఎంగిలిచుట్ట, వాడునోరు తెరిస్తేచాలు కంపుకొడుతోంది.

'ఎందాక ఎళ్తావు బాబూ!'

వాకయితే ఒళ్ళుమండుకొచ్చింది. నాపక్కనే కూర్చుండే చాలక పలకరింపులు కూడానూ, ఇలాంటి వాళ్ళనస్సలు నమ్మకూడదు దొంగవెధవలు.

ఇంతలో కంచరపాలెం వొచ్చింది. బస్సులో ఫ్రీగా నిలబడేందుకైనా, చోటులేదు. వాడెవ్వరివైపో తదేకంగా చూస్తున్నాడు.

ఎవర్ని చెప్మా! అంతదీర్ఘంగా చూస్తున్నాడు?

ఎవరో ముసలాయన యెడంకాలు పూర్తిగా చచ్చుబడి పోయింది. పేంట్ వొదులుగా వ్రేలాడుతోంది. చేతికర్ర ఐనా, పైన రాడ్‌ని పట్టుకోవడానికి విఫల ప్రయత్నం చేస్తున్నాడు.



ఇలాంటోళ్ళు బస్సెందుకెక్కుతారో? ఏ రిక్షాలోనో, ఆటోలోనైనా పోకుండా. ఎవరో స్టూడెంట్ విసుక్కుంటున్నాడు.

నా పక్కవాడు హఠాత్తుగా లేచి నిలబడ్డాడు. దిగిపోతాడు గాబోలు అనుకున్నాను.

పెద్దా... ఓయ్ పెద్దా... రాయ్యా ఈడ్నకూకో... అంటూ ఆ ముసలాయన్ని తన. సీట్లో కూర్చుండబెట్టాడు.

ఆ క్షణాన ఆ ముసలాయన కళ్ళలో వెలుగులు వేనెప్పటికీ మరిచిపోలేను.

దరిద్రుడు, వెధవ, దొంగవెధవ, అని నేనింతసేపూ ఏవగించుకున్న మురికిబట్టలమాటున దాగిన మనస్సు ఇంతస్వచ్ఛమైనదా? రాడ్ పట్టుకొని నిలబడ్డ అతను నా కంటికి కొన్నివందల రెట్లు అధికంగానూ, అతని ముందునేనొక పరమాణంగానూ అనిపించింది.

బరువెక్కిన హృదయంతో నిస్తేజంగా అలా కూర్చుండిపోయాను.

— కొండల అక్కారావు, వైజాగ్.